సాక్షి
ఏలూరు

ఆదివారం । 8 । జనవరి । 2023

I



భక్తుల రద్దీ సాధారణం

ద్వారకాతిరుమల: చినవెంకన్న దివ్య క్షేత్రంలో శనివారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. పెద్ద పండగ ముందు రోజులు కావడమే కారణమని ఆలయ సిబ్బంది అంటున్నారు.



శోభాయమానం

ద్వారకాతిరుమల: చినవెంకన్న క్షేత్రంలో ధనుర్మాస ఉత్సవాలు, ద్రవిడ ప్రబంధ అధ్యయనోత్సవాల్లో భాగంగా ఉదయం, రాత్రి తిరువీధి సేవలు నేత్రపర్వంగా జరుగుతున్నాయి.

వరాల వెంకన్నకు పూజలు

అత్తిలి: ఈడూరులోని వరాల వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. శ్రీవారు విశేష అలంకరణలో దర్శనమిచ్చారు.



న్యూస్‌రీల్

హ్యాండ్‌బాల్ జట్టు ఎంపిక



ఎంపికైన జేఎన్‌టీయూ జట్టు

దెందులూరు: సౌత్‌జోన్ హ్యాండ్‌బాల్ పోటీలకు జేఎన్‌టీయూ (కాకినాడ) జట్టుకు వేగవరం ఇంజనీరింగ్ కళాశాలలో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. కళాశాల ఏఓ కరుణానిధి మాట్లాడుతూ శనివారం కళాశాలలో జరిగిన జేఎన్‌టీయూ హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైన జట్టు త్వరలో తమిళనాడులోని సేలంలో జరిగే సౌత్ జోన్ పోటీల్లో పాల్గొంటారన్నారు. హ్యాండ్ బాల్ కోచ్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ.11.80 లక్షలు



రాట్నాలమ్మ దేవస్థానంలో హుండీ ఆదాయం లెక్కిస్తున్న దృశ్యం

పెదవేగి: రాట్నాలకుంటలోని రాట్నాలమ్మ దేవస్థానంలో హుండీ ఆదాయాన్ని శనివారం లెక్కించారు. 84 రోజులకు రూ.11,80,490 ఆదాయం లభించినట్టు దేవస్థానం చైర్మన్ చళ్లగోళ్ల వెంకటేశ్వరరావు తెలిపారు. ఏలూరు తనిఖీదారు బాలు పర్యవేక్షణలో లెక్కింపు జరిగిందన్నారు. ధర్మకర్తల మండలి సభ్యులు గరికి ముక్కు సర్వేశ్వరరావు, పాకలపాటి వెంకటేశ్వరరావు, మేరుగు వెంకటేశ్వరరావు, నంబూరి జనార్దన్ రావు, నాగార్జున లక్ష్మీ రాధిక, ఈడా ధర్మారావు, కట్టా నాగరాజు, లింగాల కనకారావు, కార్యనిర్వహణాధికారి సతీష్ పాల్గొన్నారు.

ప్రజా పాలనే లక్ష్యంగా..

- ప్రభుత్వ ఉద్యోగులకు ముఖ హాజరు
- అన్ని శాఖల్లోనూ తప్పనిసరి
- ఈనెల 17 నుంచి అమలుకు సన్నాహాలు
- ఇప్పటికే విద్య, వైద్యశాఖల్లో అమలు

ఏలూరు (మెట్రో): ప్రజాపాలనలో భాగంగా పారదర్శక సేవలే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ప్రజల వద్దకు పాలనను చేరువ చేయడంతో పాటు ప్రభుత్వ ఉద్యోగుల సైతం తమ విధులు బాధ్యతతో నిర్వర్తించి మరిన్ని సేవలు అందించడం, సమయపాలన పాటించేలా చర్యలు తీసుకుంటోంది. విద్యా, వైద్య రంగాలపై ప్రత్యేక దృష్టి సారించిన ప్రభుత్వం ముందుగా ఉపాధ్యాయులకు ముఖ హాజరు (ఫేస్ రికగ్నేషన్)ను తప్పనిసరి చేసింది. దీని ద్వారా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా ప్రతి పాఠశాలలో ఉపాధ్యాయులు సమయానికి విధులకు హాజరవుతూ విద్యాబోధన చేయడంతో పాటు విద్యా సౌకర్యాలను సైతం పాఠశాలల్లోనే ఉండి పర్యవేక్షించే అవకాశం ఏర్పడింది. జిల్లావ్యాప్తంగా సుమారు 13 వేల మంది ఉపాధ్యాయులు ఈ విధానంలో హాజరు వేస్తున్నారు.



ఈనెల 2 నుంచి వైద్యారోగ్యశాఖలో..

పారదర్శకంగా ప్రజలకు వైద్యసేవలు అందాలనే భావనతో వైద్యారోగ్య శాఖలోనూ ముఖ హాజరును ప్రభుత్వం ఈనెల 2వ తేదీ నుంచి తప్పనిసరి చేసింది. తద్వారా తప్పనిసరిగా వైద్య సిబ్బంది వైద్యశాలకు వెళ్లి విధులు నిర్వహించాలి. ఇలా ప్రజలకు పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. సుమారు 3 వేల మంది సిబ్బంది ఈ విధానంలో హాజరు వేస్తున్నారు.

మిగిలిన శాఖలకు 17 నుంచి..

జిల్లావ్యాప్తంగా ఉన్న రెవెన్యూ, ఇరిగేషన్, జిల్లాపరిషత్, సచివాలయం ఇలా ప్రతి ఒక్కశాఖలోని అధికారులు, సిబ్బంది ఇకపై తప్పనిసరిగా కార్యాలయానికి వెళ్లి ముఖ హాజరు వేయాల్సి ఉంటుంది. సంక్రాంతి అనంతరం 17వ తేదీ నుంచి ఈ విధానాన్ని అమలు చేసేలా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 45 వేలకు పైగా ఉన్న ఉద్యోగులు ముఖ హాజరు వేయాల్సి ఉంటుంది.

అవగాహన కల్పించాలని..

ముఖ హాజరును ఉద్యోగ సంఘాలు స్వాగతిస్తూనే సాంకేతిక సమస్యలు తొలగించి, 4వ తరగతి ఉద్యోగులకు అవగాహన కల్పించాలని కోరుతున్నారు. 4వ తరగతి ఉద్యోగులు ఆండ్రాయిడ్ ఫోన్లను కలిగి ఉండాలని, లేకపోతే వేరొకరి ఫోన్‌పై ఆధారపడాల్సి వస్తుందని ఈ సమస్యలను తొలిగించి పకడ్బందీగా ముఖ హాజరును అమలు చేయాలని ఉద్యోగ సంఘాల నేతలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

సాంకేతిక సమస్యలు తొలగించాలి



ప్రభుత్వం ప్రవేశపెట్టిన ముఖహాజరును స్వాగతిస్తున్నాం. అయితే సాంకేతిక సమస్యలను పరిష్కరించి పూర్తిస్థాయిలో ముఖ హాజరును అమలు చేయాలి. గతంలో హాజరుపట్టీల్లో సంతకాలు చేసి ఉద్యోగ విధులను ప్రారంభించాం. ముఖ హాజరు ద్వారా హాజరు నమోదు చేసి ప్రతి ప్రభుత్వ ఉద్యోగి విధులు నిర్వహించడానికి ఎటువంటి ఇబ్బంది లేదు.

– చోడగిరి శ్రీనివాసరావు, ఉమ్మడి ఎన్‌జీఓ అధ్యక్షుడు

స్వాగతిస్తున్నాం



ముఖ హాజరును ఉద్యోగులంతా స్వాగతిస్తున్నారు. అయితే 4వ తరగతి ఉద్యోగులకు దీనిపై అవగాహన లేదు. వారికి అవగాహన కల్పించి ముఖ హాజరును అమలు చేయాలి. లేదంటే ప్రారంభంలోనే ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది. ప్రతి ఒక్క ఉద్యోగి ప్రజలకు సేవలు అందించడంలో ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉంటారు.

– కె.రమేష్‌కుమార్, అమరావతి జేఏసీ, రెవెన్యూ ఉద్యోగుల జిల్లా అధ్యక్షుడు

గ్రూప్-1 పరీక్షలకు సర్వం సిద్ధం

- 6 కేంద్రాలు.. 3,106 మంది అభ్యర్థులు
- కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు
- పరీక్షల నిర్వహణకు కంట్రోల్‌రూమ్
- ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి లేదు
- కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ వెల్లడి



ఏలూరు(మెట్రో): జిల్లాలో ఆదివారం జరిగే ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్-1 స్క్రీనింగ్ పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు చేసినట్టు కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ తెలిపారు. శనివారం ఆయన వివరాలు వెల్లడించారు. పరీక్షలకు 3,106 మంది అభ్యర్థులు హాజరుకానున్నారని, ఆరు కేంద్రాలు ఏర్పాటుచేశామన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పేపర్-1, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పేపర్-2 నిర్వహిస్తామన్నారు. ఉదయం 9 గంటల నుంచి 9.30 వరకు, మధ్యాహ్నం 1 గంట నుంచి 1.30 గంటల వరకు అభ్యర్థులను కేంద్రంలోకి అనుమతిస్తారని, మరో 15 నిమిషాలు గ్రేస్ పీరియడ్ ఉంటుందన్నారు. పరీక్షా సమయం పూర్తయ్యేవరకు అభ్యర్థులు బయటకు వెళ్లేందుకు వీలుండదన్నారు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

అభ్యర్థులు హాల్‌టికెట్‌తో పాటు ప్రభుత్వం గుర్తించిన ఏదైనా ఒక ఒరిజినల్ ఫొటో గుర్తింపు కార్డు వెంట తీసుకురావాలని కలెక్టర్ సూచించారు. కేంద్రంలోకి ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించరని స్పష్టం చేశారు. వీటిని గుర్తించేందుకు కేంద్రం వెలుపల స్క్రీనింగ్‌కు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. అభ్యర్థుల సౌకర్యార్థం 9490172109, 94910 41436 నంబర్లతో కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేశామన్నారు. పరీక్షా కేంద్రం సమీపంలో జిరాక్స్, ఆన్‌లైన్ కేంద్రాలను మూసివేసేలా చర్యలు తీసుకున్నామన్నారు. కేంద్రాల వద్ద 144వ సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. ఉదయం, మధ్యాహ్నం పరీక్షలకు ప్రశ్నపత్రాలు వేర్వేరు రంగుల్లో ఉంటాయని తెలిపారు.

పరీక్షా కేంద్రాలు

- వట్లూరు సీఆర్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాల (కోడ్-112801)
- వట్లూరు రైల్వేగేట్ సమీపంలోని సీఆర్‌ఆర్ పాలిటెక్నికల్ కళాశాల (కోడ్-112802)
- వట్లూరు ఫ్లైఓవర్ సమీపంలోని సీఆర్‌ఆర్ మహిళా కళాశాల (కోడ్-112803)
- ఏలూరు ఫైర్‌స్టేషన్ సమీపంలోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాల (కోడ్-112804)
- ఏలూరు మోర్ మార్కెట్ రోడ్డులోని నారాయణ బాలుర జూనియర్ కళాశాల (కోడ్-112805)
- వట్లూరు ఫ్లైఓవర్ సమీపంలోని సీఆర్‌ఆర్ మహిళా జూనియర్ కళాశాల (కోడ్-112806)

సేంద్రియ సాగుతో అధిక దిగుబడులు

తాడేపల్లిగూడెం: సేంద్రియ వ్యవసాయం అవసరమని శనివారం వెంకట్రామన్నగూడెంలోని కేవీకేలో జరిగిన ప్రకృతి, సేంద్రియ వ్యవసాయంపై అవగాహన సదస్సులో శాస్త్రవేత్తలు తెలిపారు. ప్రధాన శాస్త్రవేత్త ఈ.కరుణశ్రీ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో సాంకేతికత జోడించి జీవన ఎరువులు, జీవ నియంత్రణ కారకాల తయారీ గురించి అవగాహన పెంచుకుంటే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చన్నారు. క్షేత్రస్థాయిలో జీవన ఎరువులు, జీవ నియంత్రణ కారకాల వినియోగం గురించి డీపీఎం తాతారావు వివరించారు. సేంద్రియ సాగుతో భూమి సారవంతం అవుతుందని శాస్త్రవేత్త ఎం.రాఘవేంద్రరెడ్డి అన్నారు. వివిధ మండలాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

ముగిసిన 'ఉద్యాన' పోటీలు

తాడేపల్లిగూడెం: వెంకట్రామన్నగూడెంలోని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన వర్సిటీలో మూడు రోజులుగా జరుగుతున్న పదో అంతర కళాశాలల క్రీడా పోటీలు శనివారం ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి అతిథిగా హాజరైన వీసీ టి.జానకిరామ్ మాట్లాడుతూ ఆహ్లాదకరమైన వాతావరణంలో జరిగిన పోటీల్లో 300 మందికి పైగా విద్యార్థులు పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థుల మధ్య సహృద్భావ వాతావరణం, పోటీతత్వం మాత్రమే ఉన్నతస్థాయికి తీసుకువెళుతుందన్నారు. విజేతలు జాతీయస్థాయిలో పోటీపడి యూనివర్సిటీకి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులు, అధికారులు పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఆర్‌బీకేల ద్వారా తక్కువ ధరకే ఉత్పత్తులు

ఏలూరు(మెట్రో): రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు తక్కువ ధరకే వివిధ రకాల ఉత్పత్తులు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా వ్యవసాయ పరిశ్రమల అభివృద్ధి సంస్థ (ఆగ్రోస్) ఉమ్మడి జిల్లాల మేనేజర్‌లు జె.కృష్ణయ్య, నరసరాజు ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 48 మండలాల్లో వ్యవసాయ యంత్రాలు, యాంత్రీకరణ పనిముట్లను రైతులకు విక్రయిస్తామని, రైతు సేవా కేంద్రాల ద్వారా నిరుద్యోగ పట్టభద్రులు, పాలిటెక్నిక్ డిప్లమో అభ్యర్థులకు అవకాశం కల్పించి ఆయా సేవా కేంద్రాల్లో ఈ వ్యవసాయ పనిముట్లను అందించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ముందుగా ఆగ్రోస్ ఆధ్వర్యంలో ప్రతి మండలంలో రైతు సేవా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని, ఆయా రైతు సేవా కేంద్రాల్లో వీటిని అందుబాటులో ఉంచుతామని తెలిపారు. మరిన్ని వివరాలకు సెల్ 99480 76859లో సంప్రదించాలని కోరారు.

రేపు యథావిధిగా 'స్పందన'

ఏలూరు (మెట్రో): ఏలూరు కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం 10 గంటల నుంచి స్పందన కార్యక్రమం నిర్వహిస్తామని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే డివిజనల్, మున్సిపల్, మండల కార్యాలయాల్లోనూ స్పందన కార్యక్రమం నిర్వహిస్తారని, అర్జీదారులు కోవిడ్ నిబంధనలు పాటిస్తూ హాజరుకావాలని సూచించారు.

రాష్ట్రంలో సంక్షేమ పాలన

- ఎమ్మెల్యే కొఠారి అబ్బయ్యచౌదరి
- దెందులూరులో 100 రోజులు పూర్తయిన 'గడపగడపకు' కార్యక్రమం



కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు కొఠారి అబ్బయ్యచౌదరి, పుప్పాల వాసుబాబు

ఏలూరు రూరల్: రాష్ట్రం ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్నా పేదలకు ఇచ్చిన మాట ప్రకారం సీఎం జగన్ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని, పింఛన్లు అందిస్తున్నారని దెందులూరు ఎమ్మెల్యే కొఠారి అబ్బయ్యచౌదరి అన్నారు. దెందులూరు నియోజకవర్గంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం వంద రోజులు పూర్తయిన సందర్భంగా శనివారం మాదేపల్లి గ్రామంలో కొత్త పింఛన్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ పింఛన్లు తొలిగిస్తున్నారంటూ టీడీపీ నాయకులు తప్పుడు ప్రచారంతో ప్రజలను మోసగించాలని ప్రయత్నిస్తున్నారని దుయ్యబట్టారు. నియోజకవర్గంలో పేదల ఇళ్ల స్థలాల కోసం ప్రభుత్వం కోట్ల రూపాయలు వెచ్చించి 289 ఎకరాలు భూమి కొనుగోలు చేసి 9,429 మందికి స్థలాలు మంజూరు చేసిందన్నారు. పెదవేగి మండలంలో రూ.71 కోట్లతో తాగునీటి ప్రాజెక్టుకు సీఎం జగన్ పచ్చజెండా ఊపారన్నారు. నాడు-నేడు పథకంలో నియోజకవర్గంలో 156 బడులను అభివృద్ధి చేశామన్నారు. రూ.50 కోట్లతో కైకలూరు, పెదపాడు, కొల్లేరు రోడ్లు అభివృద్ధి చేస్తున్నామని, ఇవేమీ టీడీపీ నాయకులకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు.

రూ.400 కోట్లతో రెగ్యులేటర్లు

దెందులూరు, ఉంగుటూరు, కైకలూరు నియోజకవర్గాల్లో కొల్లేరు ప్రజలను ఆదుకునేందుకు సీఎం జగన్ రూ.400 కోట్లతో రెగ్యులేటర్ల నిర్మాణం చేపట్టారని ముఖ్య అతిథిగా విచ్చేసిన ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. త్వరలో మరో రెగ్యులేటర్‌కు శంకుస్థాపన చేయనున్నారన్నారు.

చర్చకు రావాలంటూ సవాల్

నియోజకవర్గంలో అభివృద్ధిపై టీడీపీ నాయకులు చర్చకు రావాలని ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి సవాల్ విసిరారు. ముందుగా సీసీ రోడ్డు, డ్రైనేజీ, ప్రహరీ గోడ అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎంపీపీ పెన్మత్స శ్రీనివాసరాజు, జెడ్పీటీసీ మండల సరస్వతి, ఇడా చైర్మన్ మధ్యాహ్నపు ఈశ్వరి, సర్పంచ్ కొరపాటి శ్రీరామ్‌ప్రభుదేవ్, నాయకులు పీవీరావు, తేరా ఆనంద్, మండల కొండలరావు, నరహరిశెట్టి రాధాకృష్ణ, బొల్లిముంత రామ్మోహనరావు, ఎంఆర్‌డీ బలరాం పాల్గొన్నారు.

క్లుప్తంగా

యువత దృష్టిని క్రీడల వైపు మళ్లించండి



సమావేశంలో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, పక్కన డీఎస్పీ అశోక్‌కుమార్‌గౌడ్

నూజివీడు: సంక్రాంతి సందర్భంగా కోడిపందేలు, పేకాట, గుండాట, ఇతర జూదాల వైపు మళ్లకుండా యువత క్రీడల వైపు దృష్టి సారించాలని సబ్‌కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ హితవు పలికారు. సబ్‌కలెక్టర్ కార్యాలయంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సంక్రాంతి సందర్భంగా మండల, డివిజన్ స్థాయి వాలీబాల్ పోటీల నిర్వహణపై పీఈటీలు, పీడీలతో శనివారం సబ్‌కలెక్టర్ సమావేశం నిర్వహించారు. సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ నిబంధనలను అతిక్రమించి కోడిపందేలను నిర్వహిస్తే ఏపీ గేమింగ్ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. జూదాల్లో పాల్గొని ఆర్థికంగా ఇబ్బందులకు గురికావొద్దని సూచించారు. అన్ని మండలాల్లో ఇప్పటికే 144 సెక్షన్‌ను విధించామని, యువత క్రీడల వైపు ఆసక్తి కనబరిచేలా తగిన ప్రచారం నిర్వహించాలన్నారు. పోలీసుశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆటల పోటీలలో యువత పాల్గొని జూదాలకు, కోడిపందేలకు దూరంగా ఉండాలన్నారు. డీఎస్పీ ఈ అశోక్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలను నిర్వహిస్తున్నామని, ఇవి మండల స్థాయిలో, డివిజన్ స్థాయిలో ఉంటాయన్నారు. మండల, డివిజన్ స్థాయిలో గెలుపొందిన వారికి నగదు బహుమతులు అందిస్తామన్నారు. ఎస్సైలు తలారి రామకృష్ణ, కుటుంబరావు పాల్గొన్నారు.

సుపరిపాలనలో జగన్ ప్రభుత్వం ముందంజ

- ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ
- తాడేపల్లిగూడెంలో కొత్త పింఛన్ల పంపిణీ



తాడేపల్లిగూడెంలో మహిళకు పింఛను ఇస్తున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి

తాడేపల్లిగూడెం అర్బన్ : సుపరిపాలన అందించడంలో మన రాష్ట్రం ముందంజలో ఉందని ఉపముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయం వద్ద నూతనంగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుపరిపాలన అందిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంపై ప్రతిపక్షాలు లేనిపోని ఆరోపణలు చేస్తున్నాయని విమర్శించారు. ఇటీవల నూతనంగా లబ్ధిదారులుగా గుర్తించిన 976 మందికి పింఛను కార్డులతోపాటు ప్రతి లబ్ధిదారునికి రూ.2,750 నగదు అందిస్తున్నామన్నారు. సమర్థవంతుడైన వైఎస్ జగన్ పాలనలో ప్రజలందరూ సంతోషంగా ఉన్నారన్నారు. మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఉచిత కరెంటు ఇస్తానని చేసి ఎన్నికల హామీని తు.చ తప్పకుండా అమలు చేశారన్నారు. ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టి పేదవాడికి కార్పొరేట్ వైద్యం ఉచితంగా అందిస్తున్నారని తెలిపారు. తండ్రిని మించిన తనయుడిగా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలతోపాటు ఇవ్వని హామీలను అమలు చేసిన సమర్థుడు సీఎం వైఎస్ జగన్ అన్నారు. పేద విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలనే లక్ష్యంతో ఫీజు రీయింబర్స్‌మెంటును కొనసాగిస్తూ అమ్మ ఒడి, విద్యాదీవెన, విద్యావసతి, గోరుముద్ద వంటి పథకాలను ప్రవేశపెట్టారన్నారు. గతంలో తన పాలనను చూసి ఓటెయ్యండని వైఎస్సార్ కోరిన రీతిలోనే వైఎస్ జగన్ పాలన చూసి ఓటేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వైఎస్ జగన్ పాలన మాదిరిగా టీడీపీ ప్రభుత్వంలో చేయకపోవడం చంద్రబాబు అసమర్థతను ప్రజలే ఎలుగెత్తి చెబుతున్నారన్నారు.

పవన్‌కల్యాణ్ జనసేన పార్టీ ఏర్పాటు చేసి విడుదల చేసిన మ్యానిఫెస్టోకు ఆకర్షితులై ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు ఆ పార్టీలో చేరారని, అయితే ఇప్పుడు చంద్రబాబు చేతిలో బొమ్మ మాదిరిగా ఎపవన్ తీరు చూసి వారందరూ జనసేన పార్టీ నుంచి దూరమయ్యారని చెప్పారు. కాపు జాతిని అడ్డుపెట్టుకుని రాజకీయం చేస్తున్నారని ఆరోపించారు. తమకు అధికారం ఇస్తే వైఎస్ జగన్ ఇచ్చిన సంక్షేమ పథకాలు రద్దు చేసి రాష్ట్ర ప్రజలను ఆదుకుంటామని చెప్పడం వారి అవివేకానికి నిదర్శనమన్నారు.

టీడీపీ బతికి బట్టకట్టేది లేదు

టీడీపీ పోస్టుమార్టం అయిపోయిన పార్టీ అని, ఆ పార్టీ బతికి బట్టకట్టేదిలేదని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. మంత్రి కొట్టు సత్యనారాయణను కలిసేందుకు పట్టణానికి విచ్చేసిన ఆయన నూతన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. టీడీపీ.. కుక్కలాంటిదని దాని పాలు కుక్కపిల్లకే తప్ప మిగతా వాటికి పనిచేయవన్నారు. ఎవైస్సార్ సీపీ ఆవులాంటిదని, దాని పాలు దాని దూడతోపాటు మనం తాగేందుకు, దైవ పూజల్లోను పనిచేస్తాయని చెప్పారు. తమ ప్రభుత్వం కుల, మత, వర్గ, ప్రాంత విభేదాలు లేకుండా రాజకీయాలకు అతీతంగా అర్హులైన వారందరికి సంక్షేమ పథకాలను అందిస్తోందన్నారు. టీడీపీ పాలనలో జన్మభూమి అని లఫంగి కమిటీలు ప్రజలను దోచుకుతిన్నాయని, సంక్షేమ పథకాలు కావాలంటే లంచాలు దుండుకున్నాయన్నారు. మహిళలతో అసభ్యంగా ప్రవర్తించిన కిరాతకులు ఉండేవారన్నారు. తమ ప్రభుత్వంలో పార్టీ ప్రమేయం లేకుండా వలంటీర్లు ప్రతి ఇంటికీ వెళ్లి అర్హులను గుర్తించి సంక్షేమ పథకాలు అందిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బి.బాలస్వామి, కొలుకులూరి ధర్మరాజు, బోణం విజయనిర్మల, పట్నాల గౌరీ గణపతి, ఎంపీపీ దాసరి హైమావతి, సర్పంచ్ భావన ధాన్యలక్ష్మి, టి.జయలక్ష్మి, వాకా వెంకటదుర్గాభవాని, వైస్ ఎంపీపీ శివ, గుండుమోగుల సాంబయ్య, కర్నాటి కన్నయ్య, కెకాల శ్రీనివాసు, సంపతరావు కృష్ణారావు, మిద్దే ఆదినారాయణ, రెడ్డి సూరిబాబు పాల్గొన్నారు.



ఆకివీడు : సిద్ధాపురంలో కోడి పందేల బరిని ట్రాక్టర్‌తో దున్నిస్తున్న ఎస్సై కె.రాజారెడ్డి

కోడిపందేల బరులు ధ్వంసం

కోడిపందేలపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. జిల్లాలో ఇప్పటికే సిద్ధం చేస్తున్న బరులను గుర్తించి ధ్వంసం చేస్తున్నారు. ఆకివీడు మండలం సిద్ధాపురంలో ఎస్సై కె.రాజారెడ్డి ఆధ్వర్యంలో బరి కోసం సిద్ధం చేసిన ప్రాంతాన్ని ట్రాక్టర్‌తో దున్నించి వేశారు. అలాగే ఆగిరిపల్లి మండలం అడవి నెక్కలం గ్రామంలో సిద్ధం చేసిన కోడిపందేల బరిలో ఫెన్సింగ్ స్తంభాలను నూజివీడు రూరల్ సీఐ ఆర్.అంకబాబు, ఆగిరిపల్లి ఎస్సై ఎస్.చంటిబాబు ధ్వంసం చేశారు. సీఐ మాట్లాడుతూ తోట యజమానిపై బైండోవర్ కేసు నమోదు చేసి తహసీల్దార్ కోర్టులో హాజరుపరుస్తామన్నారు. ఇప్పటివరకు తమ సర్కిల్ పరిధిలో 70 మంది కోడికత్తుల తయారీదారులను, 42 మంది పందెంరాయుళ్లను బైండోవర్ చేశామన్నారు.

– నూజివీడు/ఆకివీడు



నూజివీడు : అడవినెక్కలంలో మామిడి తోటలో సిద్ధం చేసిన కోడిపందేల బరిలో ఫెన్సింగ్ స్తంభాలు ధ్వంసం చేస్తున్న సీఐ అంకబాబు, ఎస్సై చంటిబాబు

ఇంటింటా పథకాల లబ్ధి



పోలవరం రూరల్ : పోలవరంలో గడపగడపకు మనప ప్రభుత్వం కార్యక్రమంలో మహిళలకు బ్రోచర్ అందిస్తూ ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే తెల్లం బాలరాజు



ఏలూరు టౌన్ : ఏలూరు 41వ డివిజన్‌లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వృద్ధురాలితో ఆప్యాయంగా మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆళ్ల నాని

మినుములో మచ్చల పురుగు గుబులు

ఏలూరు జిల్లాలో 8,995 ఎకరాల్లో మినుము సాగు

కైకలూరు: మినుము రైతులకు మచ్చల, లద్దె పురుగులు ముచ్చెమటలు పట్టిస్తున్నాయి. అపరాల సాగులో కీలకంగా భావించే మినుము పైరుపై పురుగులు దాడి చేస్తున్నాయి. ఏలూరు జిల్లాలో రబీ సీజన్‌లో 29,501 ఎకరాల్లో మినుము సాగు లక్ష్యాన్ని నిర్ణయించగా 8995 ఎకరాల్లో మినుము నాటారు. ప్రస్తుతం 30 నుంచి 45 రోజుల దశలో పంట ఉంది. ప్రధానంగా పల్లాకు తెగులును తట్టుకోడానికి రైతులు టీబీజీ 104, జీబీజీ 45, పీయూ 31 వంటి మినుము రకాలను సాగు చేస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో పొగాకు లద్దె పురుగు, మచ్చల పురుగులు కనిపిస్తున్నాయి. వీటి నివారణ చర్యలను వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు ఆర్.గంగాధరరావు వివరించారు.



కైకలూరు మండలం తామరకొల్లులో మినుము పైరులో పురుగులను పరిశీలిస్తున్న ఏడీ గంగాధరరావు, రైతు, ఇన్‌సెట్‌లో మినుములో లద్దె పురుగును చూపిస్తున్న రైతు

పొగాకు లద్దె పురుగు

ఈ పురుగు మొదటి దశలో పచ్చని పదార్థాన్ని గోకి తింటాయి. తదుపరి ఆకులకు రంధ్రాలు చేసి నములుతాయి. చివరి దశలో పువ్వులు, పిందెలను ఆహారంగా తీసుకుంటాయి. పొలం చుట్టూ కలుపు మొక్కలు లేకుండా రైతులు చర్యలు తీసుకోవాలి. పైరు పూత దశకు రాకముందు నుంచే జాగ్రత్తలు పాటించాలి. పొగాకు లద్దె పురుగు సాగులో ఎక్కువగా కనిపిస్తోంది.

నివారణ చర్యలు

క్లోరిపైరిఫాస్ 2-5 మిల్లీ లీటర్లు లేదా నోవాల్యురాన్ 1 మిల్లీ లీటరు లేదా థయోడికార్బ్ 1 గ్రాము లీటరు నీటిలో కలిపి పిచికారి చేయడం వల్ల ఉపయోగం ఉంటుంది. రైతులు గ్రామ వ్యవసాయ సహాయకుల సలహాలు పాటించాలి.

మరూకా మచ్చల పురుగు..

ఈ పురుగు పూత దశలో పూలను గూడుగా చేసి, లోపలి పదార్థాలను తినేస్తాయి. ఇదే పద్ధతిలో కాయలను దగ్గరగా చేర్చి రంధ్రాలు పెట్టి తింటాయి. ముఖ్యంగా రైతులు పూమొగ్గలను సేకరించి మారూకా పిల్లపురుగులను జాగ్రత్తగా గమనించాలి. పురుగు ఉధృతి అధికంగా ఉంటే వెంటనే వ్యవసాయాధికారుల సలహాలు పాటించాలి.

నివారణ

దీని నివారణకు పంట 35 రోజుల వయసుకు రాకముందే జాగ్రత్తలు చేపట్టాలి. పూత దశలో తప్పనిసరిగా వేపనూనె 5 మిల్లీలీటర్లు 1 లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. పూమొగ్గలలో మారూకా పిల్లపురుగులను గుర్తిస్తే క్లోరిపైరిపాస్ 2.5 మిల్లీలీటర్లు లేదా థయోడికార్బ్ 1.0 గ్రాములు లేదా ఎసిఫేట్ 1.0 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

ఆందోళన అవసరం లేదు

మినుము సాగులో లద్దె, మచ్చల పురుగులతో రైతులు ఆందోళన చెందొద్దు. లద్దె పురుగులు పెద్దవి గుర్తిస్తే ఎకరం పొలానికి సాయంత్రం వేళ 5 కేజీల తవుడులో 500 మిల్లీలీటర్లు క్లోరోఫైరిపాస్ లేదా 500 మిల్లీ లీటర్లు మోనోక్రొటోపాస్‌ను అరకిలో బెల్లంలో కలిపి ఉండలుగా చల్లాలి. రైతులు తెల్లదోమను జాగ్రత్తగా గమనించాలి. ఇది పల్లాకు తెగులు వ్యాప్తి చేయడంలో కీలకపాత్ర పోషిస్తోంది.

– ఆర్.గంగాధరరావు, వ్యవసాయ సహాయ సంచాలకులు, కైకలూరు

కోడికత్తులు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న కోడికత్తులు, నిందితుడితో (ముసుగు వ్యక్తి)తో డీఎస్పీ కేవీ సత్యనారాయణ, పోలీసు అధికారులు, సిబ్బంది

జంగారెడ్డిగూడెం: సంక్రాంతికి కోడిపందేల కోసం సిద్ధంగా ఉంచిన 56 కోడికత్తులను స్వాధీనం చేసుకుని ఒక వ్యక్తిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ కేవీ సత్యనారాయణ చెప్పారు. పట్టణంలోని తన కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జూద క్రీడలపై ఉక్కుపాదం మోపినట్లు తెలిపారు. సంక్రాంతి నేపథ్యంలో ఎవరైనా కోడిపందేలు, జూదం నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కోడిపందేలను నియంత్రించేందుకు కోడికత్తులు కట్టే వారిపై నిఘాపెట్టి, వారిని అరెస్టు చేయాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశామన్నారు. ఈ నేపథ్యంలో తమకు అందిన సమాచారం మేరకు ఎస్సై ఎం.సాగర్‌బాబు, ఐడీ పార్టీ ఏఎస్సై సంపత్, సిబ్బందితో కలిసి స్థానిక గాంధీబొమ్మ సెంటర్‌లో దాడి చేశామన్నారు. దీనిలో భాగంగా కులిపిలి సత్యనారాయణ ఇంటిలో తనిఖీ చేయగా 56 కోడికత్తులు లభించాయన్నారు. సత్యనారాయణ ఏటా కోడికత్తులు తయారు చేసి అమ్ముతుంటాడన్నారు. ఇతన్ని అరెస్టు చేసి కోడికత్తులు స్వాధీనం చేసుకున్నామని డీఎస్పీ తెలిపారు.

చికిత్స పొందుతూ పెయింటర్ మృతి

భీమడోలు: బైక్ అదుపు తప్పి తీవ్ర గాయాలైన ఓ యువకుడు విజయవాడలో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. అర్జావారిగూడెంకు చెందిన గూండ్రు విజయ్‌ప్రకాష్ (23) ఇంటర్ వరకు చదివి పెయింటింగ్ పనులు చేస్తున్నాడు. గత నెల 31న రాత్రి ప్రత్తికోళ్లలంకలో పనులు ముగిసిన అనంతరం స్నేహితుడిని దించేందుకు బైక్‌పై గుండుగొలను వెళ్లి తిరిగొస్తుండగా, ముందు చక్రం పంక్చరై అదుపుతప్పి పడిపోయాడు. అతనిని ఏలూరుకు, అక్కడ నుంచి విజయవాడకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ విజయ్ శుక్రవారం రాత్రి మృతి చెందాడు.

గురుకుల విద్యార్థిని మృతిపై విచారణ

ద్వారకాతిరుమల: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థిని జెస్సిక మృతిపై ఉన్నతాధికారులు శనివారం విచారణ చేపట్టారు. లింగపాలెం మండలం నరసన్నపాలెంకు చెందిన జెస్సిక గురుకుల పాఠశాలలో ఐదో తరగతి చదువుతోంది. తీవ్ర జ్వరం బారిన పడిన ఆమె ఈ నెల 3న ఇంటికి వెళ్లి అక్కడ చికిత్స పొందింది. అయితే పరిస్థితి విషమించడంతో ఈ నెల 5వ తేదీ తెల్లవారుజామున జెస్సిక మృతి చెందింది. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు విద్యార్థిని మృతిపై ఇన్‌చార్జి డీఎంఅండ్ హెచ్‌ఓ ఎం.నాగేశ్వరరావు, సాంఘిక సంక్షేమ శాఖ జేడీ మధుసూదనరావు, డీసీఓ వాసవి, మండల వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ విచారణ చేపట్టారు. దీనిలో భాగంగా గురుకుల పాఠశాల, పరిసరాలను పరిశీలించారు. అలాగే విద్యార్థులు తింటున్న ఆహారం, తాగుతున్న మంచినీటి శాంపిల్స్‌ను సేకరించి, పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి డీఎంఅండ్ హెచ్‌ఓ నాగేశ్వరరావు పాఠశాల ప్రిన్సిపల్ బెజవాడ రాణికి, సిబ్బందికి పలు సూచనలు, సలహాలనిచ్చారు. ముఖ్యంగా సెలవులకు ఇంటికి వెళ్లి తిరిగి పాఠశాలకు వచ్చే విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని సూచించారు. పాఠశాలలో పారిశుద్ధ్యం బాగానే ఉందన్నారు.



గురుకుల పాఠశాలలో విచారణ చేస్తున్న ఇన్‌చార్జి డీఎంఅండ్ హెచ్‌ఓ నాగేశ్వరరావు, అధికారులు

ఆవరణలో పందెం కోళ్ల పెంపకం

గురుకుల పాఠశాల ఆవరణలో ఒక ఉపాధ్యాయిని పందెం కోళ్లను పెంచడం తీవ్ర చర్చనీయాంశమైంది. ఆహ్లాదకర వాతావరణం, అందులోనూ విద్యార్థినులు సంచరించే ప్రాంతంలో కోళ్ల పెంపకం ఏమిటని స్థానికులు మండిపడుతున్నారు. ఇంత జరుగుతున్నా ఉన్నతాధికారులు ఏం చేస్తున్నారని పలువురు ప్రశ్నిస్తున్నారు.